రాత్రి ఎనిమిది గంటలకి పెళ్లి ముహూర్తం

## ఆమెనుచూసిన క్షణం నుంచే అర్ధాంగిని చేసుకోవాలనుకున్న అతను మనసెందుకు మార్చుకున్నాడు?

# సగటు మనిషి




సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో పెళ్లి వారింటి ముందు రాజహంసలా తెల్ల అంబాసిడర్ వచ్చి ఆగింది.

ఫుల్ సూటులో కారులోంచి ఠీవిగా దిగుతున్న త్రినాథ్‌ని చూడగానే పెళ్లి పందిట్లో స్నేహితుల మధ్య కూర్చొని కబుర్లు చెపుతున్న రవీంద్ర గభాల్న లేచి మిత్రుడికి ఎదురొచ్చి ఆనందంగా కరచాలనం చేశాడు.

"చాలా సంతోషంరా నాథ్. నువ్వు రావేమో అనుకున్నాను" అన్నాడు.

"నీ పెళ్లికి రాకుండా ఎలా ఉంటానుః చెప్పాను కదా తప్పకుండా వస్తానని" అన్నాడు త్రినాథ్ అంతే ఆనందంతో తబ్బిబ్బు పడుతూ. రవీంద్రని పెళ్లికొడుకు ముస్తాబులో చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది.

చిన్న వయసులోనే పెద్ద ఆఫీసరు హోదాలో వున్న మిత్రుడిని అతిథి మర్యాదలన్నీ జరిపి తన స్నేహితుల్నీ తల్లిదండ్రులని పరిచయం చేశాడు రవీంద్ర.

అంతలో పీటలమీద కూర్చోవాలని లోపల్నుంచి పిలుపు వస్తే త్రినాథ్‌ని మిత్రులకి అప్పగించి లోపలికి వెళ్లిపోయాడు రవీంద్ర.

ఆడ పెళ్లివాళ్లు కాస్త కలిగిన వాళ్లు లాగానే ఉన్నారు. విడిది, పెళ్లి ఏర్పాట్లు అన్నీ ఘనంగానే ఉన్నాయి అనుకున్నాడు త్రినాథ్.

పెళ్లికూతురు కూడా నాజూగ్గా



బాగుంది. బాగా అలంకరించుకొని నగలు అవి పెట్టుకొంది.

కాని ఆ పెళ్లి పందిరి అంతా ఎక్కడ పడితే అక్కడ మెరుపులా కదులుతూ చెలాకీగా తిరుగుతూ పెళ్లి పనులు చేస్తున్న సుమారు ఒక పదినెనిమిదేళ్ల లేజవ్వని శ్రీనాధ్‌ని అమితంగా ఆకర్షించింది.

ఆ అమ్మాయి పూర్తిపేరేమిటో తెలీదు

కాని అంతా 'అంజూ... అంజూ...' అని పిలుస్తున్నారు. పచ్చగా కుందనం బొమ్మలా బొద్దుగా ముద్దుగా ఉంది. చక్రాల్లా పెద్ద కళ్ళు, ఉంగరాలు తిరిగి కురవగా ఉన్న రెండు జడలు, మెడలో ఎర్రరాళ్ల నెక్లెస్, నల్లటి జరీ బోర్డరుతో పట్టు పరికిణీ, అంచు జాకట్టు, పింక్ కలర్ ఓణీ, జడలో పూలదండ, ముక్కుకి ఎర్రరాయి పొదిగిన స్టడ్. ఎవరికైనా చూడగానే ఆ అమ్మాయిని దగ్గరకి తీసుకుని ముద్దు పెట్టుకోవాలన్నంత ముగ్ధంగా ఉంది. ఆమె మగపెళ్లివారి తరపు నే అని, రవీంద్రకి బాగా దగ్గర చుట్టం అని చెప్పకనే తెలుస్తాంది.

అయితే మరి ఈ అమ్మాయి అంజు రవీంద్రకి ఏమవుతుంది?

"తను ఎలాంటి అమ్మాయి భార్య కావాలి అని కోరుకున్నాడో ఈ అమ్మాయి అచ్చం అలాగే ఉంది. ఈ అమ్మాయిని పెళ్లి చేసుకుంటే?"

పెళ్లి జరిగినంతసేపు ఆ అమ్మాయిని గమనిస్తూనే ఉన్నాడు శ్రీనాథ్. అతని మనసు ఆ అమ్మాయిలో లీనం అయిపోయింది.

'అంజూ అంజూ' అని ఎవరో ఒకరు పిలవటం 'ఆ....' అంటూ ఆ అమ్మాయి చలాకీగా అటు వెళ్లటం... పూలు విరిగినట్లు ఆమె చిరునవ్వు, చేపపిల్లల్లా చలాకీగా కదిలే ఆమె కళ్ళు, ఆమె ప్రతీ కదలిక శ్రీనాథ్ హృదయాన్ని హత్తుకుంది.

ఆమె పట్ల ఆకర్షణ పెరిగి ఆమెని పెళ్లాడాలన్న కోరిక క్షణక్షణానికి బలపడసాగింది.

పెళ్లి భోజనం ఆరగించి తను తెచ్చిన కానుక మిత్రుడికి ఇచ్చి రాత్రి పదిగంటల ప్రాంతంలో తిరుగు ప్రయాణం అయ్యాడు శ్రీనాథ్.

రాత్రికి ఉండి రేపు వెళ్లచ్చులేరా. నీకు ఏ ఇబ్బంది లేకుండా సెపరేట్‌గా రూమ్‌లో పడక ఏర్పాటు చేస్తాను" అన్నాడు రవీంద్ర.

"లేదు రవీ! ఆఫీసులో అర్జంటు వర్క్ చాలా ఉంది. ఈ వారంలోనో పై వారంలోనో చెకింగ్ ఉంటుందనుకుంటున్నా. ఇప్పుడు బయలుదేరితే రేపు ఆఫీసుకి వెళ్లచ్చు. కారుంది గదా" అన్నాడు.

పెద్ద బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నాడు శ్రీనాథ్. అందుకే ఎక్కువగా వారించలేకపోయాడు రవీంద్ర.

* * *

శ్రీనాథ్ ఆఫీసు డ్యూటీలో బిజీగా ఉన్నాడు.

ఆ వారంలోనే పై అధికారుల చెకింగ్ ఉండవచ్చని నమ్మకంగా తెల్సింది.

ఊపిరి సలపని పనితో సతమతమవుతున్నాడు. అయినా అంత టెన్షన్ లోనూ 'అంజు' రూపం మరుపుకి రావటం లేదు. ఆమె ఆలోచన్లమించి మనసు కదలటం లేదు. ఆఫీసు పనిమీద దృష్టి కేంద్రీకరించలేకపోతున్నాడు. ఆమె మనసులో తిష్ఠ వేసుకొన్నట్లు అయిపోయింది.

శ్రీనాథ్ వయసు ఇరవై ఎనిమిది. అతని పెళ్లి పూర్తిగా అతని ఇష్టం మీదనే ఉంది. పేదయింటి పిల్లయినా మంచిఅందంతో


అణుకువగలపిల్ల తన స్వంతం కావాలి అనుకున్నాడు. వృద్ధులైన తల్లిదండ్రి "నీకు నచ్చిన పిల్లని చేసుకో. నీ సుఖమే మా సుఖం" అన్నారు.

ఇన్నాళ్లు కంటికి నచ్చిన అమ్మాయి కోసం నిరీక్షిస్తున్నాడు. ఇప్పుడు ఆ నిరీక్షణ ఫలించింది అనిపిస్తూంది...

ఈ విషయం రవీంద్రకి తెలపటమే ఉత్తమం అనిపించి లెటర్ పాడ్ కలం అందుకున్నాడు.

"డియర్ రవీ!

నీ పెళ్లిలో "అంజు" అనే అమ్మాయి నా మనసుని విశేషంగా ఆకట్టుకుంది. నేను ఇన్నాళ్లు నాకు నచ్చే అమ్మాయి కోసం వెతుకుతున్న సంగతి నీకూ తెలుసుకదా కట్న కానుకల మీదగానీ వాళ్ల ఆస్తి అంతస్థుల గురించి గాని నాకు ఆసక్తి లేదు. ఆ "అంజు" అనే అమ్మాయిని నేను పెళ్లి చేసుకుందుకు ఇష్టపడుతున్నాను. బహుశా ఆ అమ్మాయి నీకు బాగా దగ్గర బంధువు అయి వుంటుంది. వివరాలు తెలుస్తాయని నీకు రాస్తున్నాను. వాళ్లకి కూడా నా విషయంలో అన్ని విధాల సమ్మతం అయితే మా పెళ్లి జరిపించే పూచీ నీదే. కాని ఒక ముఖ్య విషయం. నా గురించి వాళ్లకి అన్నీ వివరంగా చెప్పు. ఏది దాచవద్దు. నాకు పదేళ్ల వయసప్పుడు జరిగిన రోడ్డు ప్రమాదంలో నా కుడికాలు మోకాలి ఎముక విరిగింది. తప్పనిసరిగా మోకాలు తీసివెయ్యవలసి వచ్చింది కదా. ఇప్పుడంటే ఆర్టిఫిషియల్ లెగ్ పెట్టుకుంటున్నాను కనుక ఆ లోపం చెప్తే గాని తెలియదు. కానీ వాళ్లకి ఈ విషయాలన్నీ తెలియజెయ్యి. కాగా నేను చిన్నప్పట్నుంచి మన గ్రూపులో బాగా తెలివిగా అన్నింట ముందంజగా వుండేవాడ్ని. ఆ విషయం నీకూ తెలుసు. మెరిట్‌తో పై చదువులు పూర్తి చేసాను. నేను హ్యాండీకాప్డ్ కావటంతో స్పెషల్ కోటా కింద మంచి ఉద్యోగం కూడా నన్ను వరించింది. ఇప్పుడు పెద్ద ఆఫీసర్ని. తరుచు కారులోనే తిరుగుతాను.



జైపూర్ ఫుట్ పెట్టుకొని సూట్‌లో ఉంటాను గనక నా లోపం బయటికి కనిపించదు. నేను నెమ్మదిగా నడవటం నా హోదాకి తగ్గ హుందాతనంగానే అనిపిస్తుంది. కాలులేని లోపం చెపితే గాని తెలియదు. కాని ఇంటి దగ్గర నన్ను చూడగానే నా లోపం చెప్పకనే తెలుస్తుంది. ఈ విషయాలన్నీ ఆ అమ్మాయి పెద్దవాళ్లకి ముఖ్యంగా ఆ అమ్మాయి అంజుకి చెప్పు. వాళ్లకి సమ్మతం అయితే మా పెళ్లికి ముహూర్తాలు పెట్టించవలసిన పెళ్లి పెద్దవి నువ్వే.

నీ మిత్రుడు
త్రినాధ్

ఉత్తరం రాసి పోస్టు చేయించాకగాని మనసు స్థిమిత పడలేదు త్రినాధ్‌కి.

ఆ అమ్మాయిని ఏ క్షణాన చూశాడోగాని మనసంతా కలవరం అయిపోయింది.

* * *

నాలుగు రోజుల తరవాత రవీంద్ర దగ్గర్నుంచి జవాబు వచ్చింది.

డియర్ త్రినాధ్

నీ ఉత్తరం నన్ను చాలా ఆనందపర్చింది.

'అంజు' పూర్తిపేరు గీతాంజలి. నాకు వరసకి బాబాయి కూతురు అవుతుంది. బాబాయి అంటే స్వంతం కాదు. అన్నదమ్ముల వరుస.

అంజు నిజంగానే చాలా అందమైనది. బాగా చురుకైనది. బి.ఎస్సీ. ఆఖరి సంవత్సరం చదువుతుంది. వీణ నేర్చుకుంటుంది. నువ్వు ఆ రాత్రి వెళ్లిపోయావుగాని ఆ మర్నాడు 'వేజువాణి' సమయంలో అది వీణ వాయించింది.

బాబాయికి ముగ్గురు మగపిల్లలు. అంజు ఒక్కర్తే కూతురు. బాబాయి అంతో ఇంతో కట్నం కూడా ఇవ్వగలడు. నీలాంటి అల్లుడు దొరికితే వాళ్లు ఎంతో ఆనంద పడతారు. నీ కాలి విషయంలో వాళ్లకి ఎలాంటి అభ్యంతరం లేదు. ముఖ్యంగా అంజుకి కూడా లేదు. ఈ పెళ్లి విషయంలో అభ్యంతరం అంటూ ఏదన్నా ఉంటే నీకే ఉండాలి. కారణం... అంజు మూగది. మాట్లాడలేని మల్లెమొగ్గ. పలుకలేని రామచిలుక.. భగవంతుడు దానికి అందం, అణుకువ, అంతో ఇంతో ఐశ్వర్యం ఇచ్చాడు కాని నోరారా మాట్లాడటానికి గొంతుక ఇవ్వలేదు. అలా అని పూర్తిగా మూగది కాదు. కంఠం కీచుగా ఉంటుంది. అపస్వరంగా ధ్వనిస్తుంది. మాట రాదు "ఆ.. ఓ' లాంటి ఒంటి అక్షరాలు మాత్రం పలుకగలదు. అదీ తగ్గు స్థాయిలో. కాస్త గట్టిగా పలకబోతే మాత్రం వినసొంపుగా వుండదు. ఏదో పిట్ట కీచుమన్నట్లు ఉంటుంది. లేదూ.... ఎవరైనా పసిపాప ఏడిచిందేమో అనిపిస్తుంది. అందుకే అంజు గొంతెత్తి పలుకదు. ఊ.. ఆ.. అంటూ చిరునవ్వుతో సంకేతాలు చేస్తుంది.

అది పాడలేని కోయిల.

ఆడలేని నెమలి.

కాని పలుకని దేవత కూడా.

బాబాయి చాలా మంది డాక్టర్లకి చూపించాడు. చిన్నచిన్న ఆపరేషన్లూ అయ్యాయి. అయినా పుట్టుకతో వున్న స్వరపేటిక లోపం వల్ల దానికి మాటరాలేదు. ఈ చిన్నలోపం

తప్పించి అంజుకి వంక లేదు. మరి ఈ విషయంలో నీకు అభ్యంతరం లేకపోతే వెంటనే జవాబు రాయి. నేను, బాబాయి స్వయంగా వస్తాము. మన స్నేహం బంధం కావాలని ఆశిస్తూ—

నీ

రవి

ఎంతో ఆశతో రవీంద్ర దగ్గర్నుంచి వచ్చిన ఉత్తరాన్ని చదివిన శ్రీనాథ్ కళ్లు ముకుళించుకుపోయాయి. మబ్బు కమ్ముకొన్నట్లు ముఖం అంతా అప్రసన్నంగా మారిపోయింది.

కట్నం కానుక తేనక్కర్లేదు. కాని అందంగా అణుకువగా ఉండాలి తన భార్య. ఎన్నో ఈతిబాధలు పడి జీవితంలో అలసిసొలసిన తనకి తన మధురమైన సంభాషణలతో ప్రేమామృతాన్ని అందించి తనని సేద తీర్చాలి అనుకున్నాడు గాని... మూగ మొద్దు తన భార్యకావాలి అనుకోలేదు. తనకి కాలు లోపం వుందనే తను వ్యథ చెందుతున్నాడు. ఇంకా తన భార్య మూగది కూడా అయితే ఎలాంటి పిల్లలు పుడతారోనని అనుక్షణం నరకం అనుభవించటం తన వల్ల కాదు. చిన్నప్పుడు కుంటివాడు అంటూ స్నేహితులు తనని గేలి చేసిన ఆ క్షణాలు తను మూగగా రోదించిన చీకటి రాత్రులు తను ఇంకా మరిచిపోలేదు. మళ్లీ మళ్లీ అలాంటి చేదు అనుభవాలు జీవితంలో ఎదుర్కొనే శక్తి తనకి లేదు. ఈ అంజు కాదంటే మరో మంజు. ఈ లోకంలో అందం తీయని కంఠం ఉన్నవాళ్లు ఎంతోమంది ఉన్నారు. కానీ కోరి కొరివితో తలగోక్కోలేదు.

క్షణంలో అంజు రూపం మనసులోంచి మాయం అయ్యింది.

మిత్రుడికి ఏం జవాబు రాయాలో తోచలేదు. కాని ఏం జవాబు రాయకపోతే మౌనం అంగీకారం అనుకొని రవి వాళ్ల బాబాయితో వస్తే ప్రమాదం... ఏదో రాయటమే మంచిది అనుకొంటూ కలం

## నాన్ విజిటేరియన్



*"అరే! అరగంట అవలేదు మనం కలిసి, అప్పుడే నేను నాన్ విజిటేరియన్ని అని ఎలా కనిపెట్టేశావ్!"*

*"అదేపనిగా నా మెదడుని తెగ తింటున్నావ్ కదా!"*

*– గీతాశ్రీనివాస్*
*(గండిపాలెం)*

అందుకున్నాడు.

డియర్ రవి—

"అనివార్య కారణాల వల్ల నా పెళ్లి మరి కొన్ని సంవత్సరాలు వాయిదా వేస్తున్నాను. అన్యధా భావించవద్దు" అని రెండులైనులు రాసి పడేసాడు.

* * *

ఆ ఉత్తరం చదివిన రవీంద్ర పెద్దగా ఆశ్చర్యపడలేదు.


అంజు మూగదని తెలియగానే శ్రీనాథ్ నిర్ణయం ఎలా ఉంటుందో వూహాకి అందలేదు.

అతనికి లోపం ఉంది కనక ఆ బాధ ఎలాంటిదో తెలుసు కనక అదే బాధననుభవిస్తున్న అంజుని ఆదరిస్తాడా లేక తనకి వున్నలాంటి లోపమే తన భార్యకి వుండకూడదని నిరాకరిస్తాడా... అన్నది తేల్చుకోలేక పోయాడు రవీంద్ర.

దెబ్బ తగిలిన వాడికే బాధ తెలుస్తుంది అంటారు. అది నిజమే. తిరిగి తనకి దెబ్బ తగలకుండా జాగ్రత్త పడతాడు. కాని ఇతరులకి తగలకుండా వుండాలని మాత్రం అనుకోడు. అది జీవిత సత్యం. పదవి హోదా పెంచుకుని తన లోపాన్ని కప్పి వుచ్చుకోవాలి అనుకుంటున్న మామూలు సగటు మగవాడు శ్రీనాథ్. తిరిగి కోరి జీవితాన్ని వెర్రి చేసుకుంటాడా?

"బాధాయుకి, అంజుకి చెప్పకుండా వ్యవహారం నడిపించటమే మంచి అయ్యింది. లేకపోతే అనవసరంగా వాళ్ల మనసుల్ని కూడా నొప్పించటం అయ్యేది" అనుకోంటూ శ్రీనాథ్ రాసిన ఉత్తరాన్ని నలిపి చెత్తబుట్టలోకి విసిరాడు రవీంద్ర.

*



డిజైన్: ఆర్. తారాబాలకృష్ణ (హైదరాబాద్)